
సాక్షి కర్నూలు

మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



వెండి రథంపై ఆది దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి సోమవారం వెండిరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు ఉత్సవమూర్తులకు సహస్ర దీపార్చన పూజలు నిర్వహించారు.



శ్రీమఠంలో సినీ దర్శకుడు

మంత్రాలయం : సినీ దర్శకుడు వివి వినాయక్ సోమవారం మంత్రాలయం వచ్చారు. మంచాలమ్మకు అర్చనలు చేసి, రాఘవేంద్రుల మూలబృందావనాన్ని దర్శించుకున్నారు.



శ్రమజీవులకు దన్ను

శ్రమ జీవులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వలస కార్మికులకు రేషన్‌కార్డు అందజేసేందుకు చర్యలు చేపట్టింది. కార్మికులకు ఈశ్రామ్ కార్డు అందజేస్తోంది.

8లో▸

న్యూస్‌రీల్

కాబోయే అమ్మలకు ఉచితంగా స్కానింగ్



స్కానింగ్ టెస్టు కోసం వేచి ఉన్న గర్భిణులు

ఆదోనిటౌన్: గర్భిణులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో స్కానింగ్, రక్త పరీక్షలు చేయించుకోవాలంటే రూ.2 వేల నుంచి రూ.3 వేల దాకా ఖర్చు వస్తుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పరీక్షలు చేయిస్తూ గర్భిణుల ఆరోగ్యాన్ని కాపాడుతోంది. ప్రతి నెలా 1వ తేదీన ఆదోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో తొమ్మిది నెలలు నిండిన గర్భిణులకు ఉచితంగా రక్త పరీక్షలు, స్కానింగ్ టెస్టులు చేస్తున్నారు. సోమవారం నిర్వహించిన క్యాంపునకు ఆదోని డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన గర్భిణులు 450 మందికి పైగా వచ్చారు. వీరికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవీలత కుర్చీలు, బెంచీలు వేయించారు. తాగునీటి వసతి కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు చేయించుకొని గర్భిణులు సంతోషంగా ఇళ్లకు చేరుకున్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 10న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు జిల్లా పరిషత్ కార్యాలయంలోని మినీ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు సీఈఓ జి.నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, విద్య.. వైద్యం, మహిళాభివృద్ధి శిశు సంక్షేమం, ఆర్థిక, ప్రణాళిక.. పనులకు సంబంధించి ఏడు స్థాయీ సంఘ సమావేశాల్లో సమీక్ష నిర్వహిస్తామన్నారు. తమ శాఖలకు కేటాయించిన సమయానికి ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, సభ్యులు హాజరు కావాలని సీఈఓ కోరారు.

రూ.14.50 కోట్లతో సీసీ రోడ్లకు ప్రతిపాదనలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.14.50 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీరు కె.సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక్కో మండలానికి రూ.60 లక్షల ప్రకారం జిల్లాలోని అన్ని మండలాల నుంచి ప్రతిపాదనలను తెప్పించామన్నారు. 25 మండలాల్లోని ఆయా గ్రామాల్లో మొత్తం 222 పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపామని.. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

నేడు రూ.7 కోట్ల రుణాల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): రుణ విస్తరణ కార్యక్రమంలో భాగంగా కర్నూలులోని ఏపీజీబీ రీజనల్ కార్యాలయంలో మంగళవారం రూ.7 కోట్ల రుణాలను పంపిణీ చేయనున్నట్లు ఏపీజీబీ రీజనల్ మేనేజర్ పి.వి.రమణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్ పాల్గొననున్నట్లు తెలిపారు. హౌసింగ్, విద్య, వాహనం తదితర రుణాలపై అవగాహన కల్పించేందుకు స్టాల్స్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కాలేజీలకు చేరిన మార్కుల జాబితాలు

కర్నూలు సిటీ: ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్ పబ్లిక్, మే నెలలో జరిగిన సప్లిమెంటరీ పరీక్షల్లో పాసైన విద్యార్థుల మార్కులు జాబితాలు కాలేజీలకు చేరినట్లు ఆర్ఐఓ గురువయ్య శెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆయా కాలేజీల్లోని ప్రిన్సిపాళ్లను సంప్రదించి ఒరిజినల్ మార్కుల జాబితాలు పొందాలని ఆయన సూచించారు.

అంగన్‌వాడీలకు ఆటవస్తువులు



ఆట వస్తువులను దించుతున్న దృశ్యం

మద్దికెర: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో అక్షరాలు నేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వస్తువులు సరఫరా చేస్తోంది. సోమవారం మండలంలోని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు ఆట వస్తువులు వచ్చాయి. వీటిని సంబంధిత కేంద్రాలకు చేర్చారు.

ఉపాధి పెరిగి.. వలసలు తగ్గి

పని కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ఉన్న ఊరిలోనే కూలీలకు 'ఉపాధి' దొరుకుతోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం అడిగిన వారందరికీ పని కల్పిస్తోంది. చిన్న, సన్నకారు రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఈ ఏడాది 92 లక్షల పని దినాలు కల్పించాలనే లక్ష్యంతో అధికార యంత్రాంగం పనిచేస్తోంది. వ్యవసాయ అనుబంధ, అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తోంది. మొదటి ఆరు నెలల్లోనే 'ఉపాధి'లో రికార్డు స్థాయిలో ప్రగతి కనిపించింది.

- ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఉపాధి పనులు
- మొదటి ఆరు నెలల్లోనే 75.78 లక్షల పనిదినాలు పూర్తి
- వేతనాల కింద కూలీలకు రూ.202.88 కోట్ల చెల్లింపు
- అభివృద్ధి పనులకు రూ.86.23 కోట్ల ఖర్చు
- జిల్లా పశ్చిమ ప్రాంతంలో తగ్గిన వలసలు



ఉపాధి పనులకు హాజరైన కూలీలు

కర్నూలు(అగ్రికల్చర్): వలసలు నియంత్రించడంతోపాటు పల్లెల ప్రగతికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తోడ్పడుతోంది. ఒక పని దినం రూ.448 ఉండగా.. ఇందులో లేబర్ కాంపోనెంటు కింద రూ.272, మెటీరియల్ కాంపోనెంటు కింద రూ.176 ప్రకారం ఖర్చు చేయవచ్చు. మెటీరియల్ కాంపోనెంటు కింద జిల్లాలో గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు, బల్క్‌మిల్క్ కూలింగ్..తదితర భవన భవనాల నిర్మాణాలు చేపడుతున్నారు. అలాగే పండ్లతోటల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది (2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 92 లక్షల పని దినాలు కల్పించాలనేది లక్ష్యం. అయితే ఆరు నెలల్లోనే 75.78 లక్షల పనిదినాలు కల్పించారు. లేబర్, మెటీరియల్ కాంపోనెంట్ల కింద రూ.289.11 కోట్లు ఖర్చు చేశారు. ఉపాధి పనులకు హాజరైన కూలీలకు వేతనాల కింద రూ.210 కోట్లు చెల్లించారు.

అక్రమాలకు తావు లేకుండా...

టీడీపీ హయాంలో ఉపాధి పనులకు 100 మంది హాజరైతే మస్టర్‌లో 200 మంది హాజరు వేసి టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిధులను కొల్లగొట్టారు. మెటీరియల్ కాంపోనెంటు పనుల్లోనూ అడ్డుగోలుగా దోచుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా మస్టర్ వేస్తున్నారు. దీనిద్వారా రోజుకు రెండు సార్లు హాజరు వేస్తారు. హాజరును లైవ్ టెలీకాస్ట్ కూడా చేస్తారు. దీంతో మస్టర్‌లో అక్రమాలకు తావు ఉండే అవకాశం లేదు. కూలీలకు వేతనాలు చెల్లించడంలోనూ పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నారు. జాబ్ కార్డుకు ఆధార్, మొబైల్ నంబరు, బ్యాంకు ఖాతను లింక్ చేస్తున్నారు.

వలస వెళ్లకుండా..



ఈ చిత్రంలోని రైతుపేరు వీరన్నగౌడు. కోసిగి మండలం డి.బెళగల్ గ్రామానికి చెందిన ఈయనకు రెండు ఎకరాల పొలం ఉంది. గతంలో పంటలు పండక బతుకు తెరువు కోసం వలస వెళ్లేవారు. 2021లో ఉపాధి నిధులతో చీనీ మొక్కలు నాటుకుని తోటను అభివృద్ధి చేసుకున్నారు. అప్పటి నుంచి వలస వెళ్లకుండా ఊర్లోనే ఉపాధి పొందుతున్నట్లు చెప్పారు.

నిశ్చింతగా..

ఈ చిత్రంలో రైతు పేరు సీమన్నగారి పెద్ద ఈరన్న. పెద్దకడుబూరు మండలం గవిగట్టు గ్రామానికి చెందిన ఈయనకు నాలుగు ఎకరాల పొలం ఉంది. టీడీపీ హయాంలో ప్రతి ఏటా వలస వెళ్లేవారు. 2021లో ఉపాధి నిధులతో ఈయన సీతాఫలం మొక్కలు నాటుకుని తోటను అభివృద్ధి చేసుకున్నారు. తోటలో దిగుబడి ప్రారంభమైంది. ఉపాధి పనులతో వలస వెళ్లకుండా ఊర్లోనే నిశ్చింతగా బతుకుతున్నట్లు ఈయన చెప్పారు.



అడిగిన వారందరికీ పని

జిల్లాలో మొత్తం జాబ్‌కార్డులు 2.57 లక్షలు ఉన్నాయి. ఇందులో 4,71,934 మంది కూలీలు ఉన్నారు. జాబ్ కార్డులు పొందిన కుటుంబాల్లో 1.81 లక్షల కుటుంబాలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తున్నారు. ఈ కుటంబాల్లోని 3.18 లక్షల మంది ఉపాధి పనులను వినియోగించుకుంటున్నారు. 'ఉపాధి' కావాలని అడిగిన వారందరికీ పనులు కల్పిస్తున్నారు. రోజుకు గరిష్ట వేతం రూ.272 ఉండగా జిల్లాలో సగటు వేతనం రూ.268 లభిస్తోంది. రాష్ట్రంలోనే సగటు వేతనం కర్నూలు జిల్లాలోనే అధికంగా ఉంటోంది. ఇప్పటి వరకు దాదాపు 2,500 కుటుంబాలకు 100 రోజుల పనిదినాలు కల్పించారు.

రైతుల స్థిరాస్తి అభివృద్ధి

ఉపాధి నిధులతో మెటీరియల్ కాంపోనెంటు కింద పండ్లతోటల అభివృద్ధి ముమ్మరంగా జరుగుతోంది. 2021–22 నాటికే ఉమ్మడి కర్నూలు జిల్లాలో 30,968 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చెందాయి. 2022–23 సంవత్సరంలో కర్నూలు జిల్లాలో 3,000 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 1,568 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చెందాయి. వంద శాతం సబ్సిడీతో 2023–24లో 2,693 మంది రైతులకు సంబంధించి 4,696 ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేశారు. అన్ని రకాల పండ్లతోటలతో పాటు డ్రాగన్ ఫ్రూట్స్, పూలతోటల అభివృద్ధికి కూడా ఈ ఏడాది అవకాశం కల్పించారు. పండ్ల తోటల అభివృద్ధితో చిన్న, సన్న కారు రైతుల జీవన ప్రమాణాలు పెరిగాయి. మరోవైపు ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి.

తగ్గిన వలసలు

జిల్లాలో 2014 నుంచి 2018 వరకు ఏటా పశ్చిమ ప్రాంతం నుంచి కనీసం లక్ష కుటుంబాలు వలస వెళ్లేవి. 2019–20 నుంచి వలసలు క్రమంగా తగ్గుతూ వచ్చాయి. వర్షాలు సకాలంలో పడుతుండటంతో రైతులు వ్యవసాయంలో నిమగ్నం అవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వలసల నియంత్రణకు 2022–23లో ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసింది. ఇందులో జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ఉద్యానశాఖ, డీఆర్‌డీఏ–వైకేపీ, ఏపీఎంఐపీ, వ్యవసాయశాఖ, నీటిపారుదల దలశాఖలను భాగస్వామ్యం చేసింది. ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. దీంతో వలసలు గణనీయంగా తగ్గాయి. సంపాదన కోసం ఏటా 2000 కుటుంబాల వరకు వలస వెళ్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఈ ఏడాది 27,543 పనులు

ఉపాధి నిధులతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నారు. మైక్రో ఇరిగేషన్‌కు, కమ్యూనిటీ ఫాంపాండ్స్ నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. రైతుల వ్యక్తిగత భూముల్లో వివిధ రకాల పనులు కల్పిస్తున్నారు. రూరల్ శానిటేషన్, రూరల్ కెనెక్టివిటీ కింద పనులు చేపడుతున్నారు. వాటర్ కన్జర్వేషన్, వాటర్ హార్వెస్టింగ్ పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ఏడాది రూ.129.28 కోట్లతో మొత్తం 27,543 పనులకు గాను ఇప్పటి వరకు రూ.24.28 కోట్లతో 8,057 పనులు పూర్తయ్యాయి. మిగిలినవి కొనసాగుతున్నాయి.

లక్ష్యాలు సాధిస్తున్నాం



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో లక్ష్యాలను సాధిస్తున్నాం. అడిగిన వారందరికీ పనులు కల్పిస్తున్నాం. ఉపాధి నిధులతో లేబర్ కాంపోనెంట్ కింద చేపట్టిన అభివృద్ధి పనులను ముమ్మరం చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భవన నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 4,696 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేశాం. ఉపాధి కూలీలకు సగటు రూ.268 వేతనం లభిస్తోంది.

– అమరనాథరెడ్డి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం



అర్జీదారుల సమస్య తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ సృజన, చిత్రంలో జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూధనరావు, ఎస్‌డీసీలు రమ, నాగప్రసన్నలక్ష్మీ, సీపీఓ ఎల్.అప్పలకొండ హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల రీ ఓపెన్, అర్జీదారుల అసంతృప్తి స్థాయి పెరుగుతోందని.. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అసంతృప్తి వ్యక్తం చేసిన లబ్ధిదారుల వివరాలపై ఆడిట్ నిర్వహించి ప్రతి శనివారం తనకు నివేదిక సమర్పించాలని డీఆర్వో, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డిలను ఆదేశించారు. అర్జీదారులను కార్యాలయానికి పిలిపించుకొని పరిష్కారానికి సంబంధించిన ఎండార్స్‌మెంట్‌ను వారి చేతికిచ్చి ముట్టినట్లు రసీదు పొందాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా అధికారులందరూ స్పందనకు తప్పక హాజరు కావాలన్నారు.

మహిళల అభ్యున్నతికి మరింత తోడ్పాటు

- డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ సలీమ్‌బాషా బాధ్యతల స్వీకారం



కర్నూలు(అగ్రికల్చర్): మహిళల అభ్యున్నతికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సలీమ్ బాషా తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ జి.సృజన అనుమతితో డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై డీఆర్‌డీఏ, వైకేపీలో అమలవుతున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. డీఆర్‌డీఏ–వైకేపీ పీడీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఈయన పంచాయతీరాజ్ శాఖలో డీఎల్‌డీఓ స్థాయి అధికారి. నాలుగేళ్లుగా జిల్లా నీటియాజమాన్య సంస్థలో వాటర్‌షెడ్స్ అదనపు పీడీగా సమర్థవంతంగా పనిచేస్తున్నారు. అజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా పీఎంకేఎస్‌వై కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో 10 కొత్త చెరువులు నిర్మించడంలో విజయవంతం అయ్యారు. రెగ్యులర్ పీడీగా సలీమ్‌బాషా నియమితులు కావడంతో మహిళా సంక్షేమ కార్యక్రమాలు ఊపందుకునే అవకాశం ఏర్పడింది.

పత్తికొండకు డబుల్ ధమాకా

- సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు పెంపు
- 19 గ్రామ సచివాలయాలకు రూ.7.60 కోట్లు

కర్నూలు(అర్బన్): కరువు ప్రాంతమైన పత్తికొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు నిధులను మంజూరు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లే ఎమ్మెల్యేలు ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలను కేటాయించింది. కాగా తన నియోజకవర్గంలోని గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు అదనపు నిధులు మంజూరు చేయాలని ఇటీవల పత్తికొండకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని స్థానిక శాసన సభ్యురాలు కంగాటి శ్రీదేవి కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు జీజీఎంపీ కార్యక్రమంలో భాగంగా ఒక్కో సచివాలయానికి విడుదల చేస్తున్న రూ.20 లక్షలకు తోడు మరో రూ.20 లక్షలను విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఈ నేపథ్యంలో పత్తికొండ మండలంలోని 19 గ్రామ సచివాలయాల పరిధిలో (ఒక్కో సచివాలయ పరిధిలో రూ.40 లక్షల ప్రకారం) రూ.7.60 కోట్లు కేటాయించడం విశేషం.

15 చేనేత సహకార సంఘాలకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జీలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 15 చేనేత సహకార సంఘాలకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జీలను నియమిస్తూ జిల్లా కలెక్టర్ సృజన ఉత్తర్వులు జారీ చేశారు. నాన్ అఫీషియల్ పాలకవర్గాల పదవీ కాలం పూర్తి కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టారు.

➡ ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘానికి పర్సన్ ఇన్‌చార్జిగా ఉమ్మడి కర్నూలు జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ హరికృష్ణ నియమితులయ్యారు.

➡ కర్నూలు జిల్లాలో ఆరు, నంద్యాల జిల్లాలో 9 చేనేత సహకార సంఘాలకు పర్సన్‌ఇన్‌చార్జీలు నియమితులయ్యారు. అసిస్టెంట్ అభివృద్ధి అధికారులు సత్యంబాబు 5 సంఘాలకు, శ్రీవాణి 2 సంఘాలకు, పెద్దయ్య 3 సంఘాలకు, ప్రవీణ్‌కుమార్‌ను ఒక సంఘానికి పర్సన్ ఇన్‌చార్జీగా నియమించినట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ హరికృష్ణ తెలిపారు.

మల్లన్న భక్తులకు దసరా కానుక

వీఐపీ బ్రేక్ దర్శనం సేవాకర్తలకు రెండు లడ్డూ ప్రసాదాలు

- అతిశీఘ్ర దర్శనం భక్తులకు ఒక లడ్డు
- ట్రస్ట్‌బోర్డులో తీర్మానం
- దేవదాయశాఖ కమిషనర్ ఆమోదం
- దసరా నుంచి అమలు చేసే యోచనలో దేవస్థానం



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మల్లన్న భక్తులకు దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని దేవస్థానం తీపి కానుక ఇవ్వనుంది. మల్లన్నను స్పర్శదర్శనం చేసుకునే వీఐపీ బ్రేక్ సేవాకర్తలకు రెండు లడ్డూ ప్రసాదాలు, అతిశీఘ్రదర్శనం టికెట్టు ద్వారా స్వామి అమ్మవార్లను దర్శించుకునే భక్తులకు ఒక లడ్డూ ఉచితంగా ఇవ్వాలని దేవస్థానం ధర్మకర్తల మండలి తీర్మానించింది. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనర్ కూడా ధర్మకర్తల మండలి పంపిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. దసరా పర్వదినం నుంచి ఈ కార్యక్రమాన్ని అమలు చేసే యోచనలో దేవస్థానం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

శ్రీశైల మహాక్షేత్రంలో స్వామివారి స్పర్శదర్శనానికి భక్తులు ఎక్కువ శాతం ఆసక్తి చూపుతారు. ప్రతిరోజు ఉదయం 7.30గంటలకు, మధ్యాహ్నం 12.30గంటలకు, రాత్రి 9గంటలకు మూడు స్లాట్లలో సుమారు 2వేల మంది భక్తులను మల్లన్న స్పర్శదర్శనానికి అనుమతిస్తారు. వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్టు సేవా రుసుముగా రూ.500 ఉంది. అయితే భక్తులకు ఎలాంటి ప్రసాదాలు ఇవ్వకపోవడంతో ఈ విషయంపై ట్రస్టబోర్డు సమాలోచనలు చేసి లడ్డూ ప్రసాదం ఉచితంగా ఇచ్చేందుకు నిర్ణయించింది. దేవస్థానం అధికారులు పంపిన ప్రతిపాదనలకు కమిషనర్ ఆమోద ముద్ర వేయడంతో భక్తుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

భక్తులకు మేలు కలిగేలా ట్రస్ట్‌బోర్డు నిర్ణయాలు

శ్రీశైలం శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం దేవస్థాన ధర్మకర్తల మండలి విశేషంగా కృషి చేస్తుంది. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ట్రస్ట్‌బోర్డులో పలు నిర్ణయాలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగానే సామాన్య భక్తులను మల్లన్నకు దగ్గర చేసే విధంగా పలు ఆర్జిత సేవలను తెల్లరేషన్‌కార్డు కలిగిన భక్తులకు కల్పిస్తున్నాం. అలాగే భక్తులకు ఉచితంగా లడ్డూ ప్రసాదాలు కల్పించేందుకు తీర్మానించి, అమలు చేసేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు హిందూ ధర్మాన్ని ప్రజలకు చేరువ చేస్తున్నాం.

– రెడ్డివారి చక్రపాణిరెడ్డి, చైర్మన్, శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి

ఏసీబీ వలలో మున్సిపల్ ఉద్యోగులు

- లంచం తీసుకుంటూ పట్టుబడిన మేనేజర్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు
- తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఆదోని మున్సిపల్ కమిషనర్
- కార్యాలయానికి పిలిపించి విచారణ చేస్తున్న ఏసీబీ అధికారులు



పట్టుబడిన మున్సిపల్ మేనేజర్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లతో ఏసీబీ అధికారులు

ఆదోనిఅర్బన్/ఆదోనిటౌన్: లంచం తీసుకుంటూ ఆదోని మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మున్సిపల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు మహాలక్ష్మి, చరణ్ నుంచి రూ.10 వేలు స్వాధీనం చేసుకుని, వీరిని అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపిన వివరాల మేరకు.. ఆదోని పట్టణం అరుంజ్యోతినగర్ ఆదిఆంధ్ర మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీనివాసులు గతంలో కొన్ని కారణాలతో సస్పెండ్ అయ్యాడు. వేతనం రాకపోవడంతో నాన్–డ్రాయల్ సర్టిఫికెట్ కోసం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ భాస్కర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు మహాలక్ష్మి, చరణ్‌ను ఆశ్రయించాడు. సర్టిఫికెట్ కోసం రూ.30 వేలకు డీల్ కుదుర్చుకున్నాడు. మొదట విడతగా రూ.5 వేలు ఇచ్చి, రెండో విడత సోమవారం రూ.10 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దాడుల్లో సీఐలు తేజేశ్వర్‌రావు, కృష్ణారెడ్డి, వంశీనాథ్, ఇంతియాజ్‌బాషా, క్రిష్ణయ్య, ఎస్ఐ సుబ్బరాయుడు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ దాడులు జరుగుతున్న సమయంలో కమిషనర్ రఘునాథ్‌రెడ్డి వచ్చి అక్కడి నుంచి వెంటనే తిరిగి తప్పించుకొని వెళ్తుండగా ఏసీబీ అధికారులు చూసి ఆయన వాహనాన్ని వెంబడించారు. మున్సిపల్ కమిషనర్‌ను పిలుచుకొని కార్యాలయంలోని చాంబర్‌లో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం అడిగితే తమకు సమాచారం ఇస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఇందుకోసం 14400 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.



పట్టుబడిన నగదు

దొంగ సర్టిఫికెట్‌తో ఉద్యోగంలో..

ఆదిఆంధ్ర మున్సిపల్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు దొంగ సర్టిఫికెట్‌తో ఉద్యోగం సంపాదించాడనే ఆరోపణలతో సంబంధిత అధికారులు విచారణ జరిపి సస్పెండ్ చేశారు. అంతేగాకుండా ఆయన ఉద్యోగం చేసినప్పటి నుంచి ఆయనకు వచ్చిన జీతం రికవరీ చేయాలని అధికారులు ఆదేశాలు కూడా జారీ చేశారు. ఇప్పటి వరకు జీతం రావడం లేదని, మరలా జీతం పొందేందుకు అవసరమైన క్లియరెన్స్ కోసం నాన్–డ్రాయల్ సర్టిఫికెట్ పొందేందుకు మున్సిపల్ అధికారులతో ఆయన రూ.30 వేలు డీల్ కుదుర్చుకున్నాడు. అందులో భాగంగా రూ.5 వేలు అందజేశాడు. రెండో విడతలో డబ్బు ఇచ్చే సమయంలో అవినీతి అధికారులను ఆశ్రయించాడు.

క్లుప్తంగా

బస్సు ఢీకొని డ్రైవర్ మృతి



మృతి చెందిన శేఖర్

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఢీకొని ఓ డ్రైవర్ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పలమనేరు బస్సు మంత్రాలయం నుంచి ఎమ్మిగనూరు బస్టాండ్‌లోకి వచ్చింది. ఆ బస్సు డ్రైవర్ శేఖర్ బస్సును కర్నూల్ స్టేజ్ దగ్గర నిలిపి కిందికి దిగాడు. అంతలోనే ఎమ్మిగనూరు డిపో నుంచి స్టేజ్ వద్దకు వస్తున్న బస్సు శేఖర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ట్రాఫిక్ పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ మంగలి రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్‌బాబు, హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి దుర్మరణం



రాఘవేంద్ర (ఫైల్)

డోన్ రూరల్: మండల పరిధిలోని ఉంగరానిగుండ్ల గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం ట్రాక్టర్ బోల్తా పడి ఓ యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని ఇందిరాంపల్లి గ్రామానికి చెందిన రాఘవేంద్ర (23) వ్యక్తి గత పని మీద చక్రవర్తి అనే యువకుడి ట్రాక్టర్‌లో డోన్‌కు బయలుదేరాడు. ఉంగరానిగుండ్ల గ్రామం వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి డీవైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో రాఘవేంద్ర మృతి చెందగా డ్రైవర్ చక్రవర్తికి గాయాలయ్యాయి. ఈ విషయం తెలియగానే మృతుడి తల్లిదండ్రులు మల్లికార్జున, సరస్వతి శోకసంద్రంలో మునిగిపోయారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

కోలుకోలేక..



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

కర్నూలు: రోడ్డు ప్రమాదానికి గురై కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం రాత్రి కోలుకోలేక మృతి చెందాడు. గత నెల 29వ తేదీన నగరంలోని సుందరయ్య సర్కిల్‌లో కారు అతి వేగంగా వచ్చి రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టింది. అటుగా వెళ్తున్న నాగరాజు అనే వ్యక్తి గమనించి క్షతగాత్రుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు చేయించాడు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కోమాలో ఉండటంతో పేరు, అడ్రస్ తెలియరాలేదు. శరీరంపై ఆకుపచ్చ, ఎరుపు, తెలుపు రంగు చెక్స్ షర్టు ధరించాడు. 5.5 అడుగుల ఎత్తు, కోల ముఖం, సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉంటుంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందడంతో ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 8639583539 లేదా 9121101078 లేదా 9121101077కు ఫోన్ చేసి సమాచారం అందించాలని వారు కోరారు.

శ్రమజీవులకు దన్ను

వలస కార్మికుల రేషన్ కార్డు

- 'ఈ శ్రామ్' గుర్తింపు కార్డు ఉంటే మంజూరుకు చర్యలు
- నివాస రాష్ట్రంలో ఉంటే ఇక్కడికి బదలాయించుకునే వీలు
- ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షల సాయం
- దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు
- ఆన్‌లైన్, వలంటీరు, సచివాలయాల్లో ప్రారంభమైన నమోదు ప్రక్రియ

శ్రమ జీవులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడుతోంది. ఇప్పటికే పలు పథకాల ద్వారా వారికి వెన్నుదన్నుగా ఉన్న సర్కారు తాజాగా వలసకార్మికులకు రేషన్‌కార్డులు అందజేసేందుకు చర్యలు చేపట్టింది. ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో మొదట ఈ–శ్రామ్ గుర్తింపు కార్డు జారీ చేసి, దీని ద్వారా రేషన్ కార్డులు అందించనుంది. దీని వల్ల పనిచేసే ప్రాంతంలోనే సులభంగా రేషన్ సరుకులు పొందే వీలు కలుగుతుంది. అలాగే ఈశ్రామ్ కార్డు ద్వారా ప్రమాదబీమాతో పాటు సంక్షేమ పథకాలు వర్తిస్తాయి.

కర్నూలు(రాజ్‌విహార్): వలస కార్మికుల గుర్తింపు ప్రక్రియ జిల్లాలో మొదలైంది. కార్మికశాఖ పర్యవేక్షణలోఈ ప్రక్రియ సాగుతోంది. ఉపాధి నిమిత్తం తెలంగాణ, ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, బీహార్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి జిల్లాకు వలస వచ్చిన కార్మికుల వివరాలను అధికారులు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. తర్వాత వీరికి ఈ శ్రామ్ గుర్తింపు కార్డు, రేషన్ కార్డు జారీ చేయనున్నారు. శ్రామికుడు ప్రమాదవశాత్తు చనిపోతే ప్రభుత్వం ప్రమాద బీమా కింద రూ.2లక్షల సహాయం చేయనుంది. 16ఏళ్ల వయస్సు నుంచి 59 సంవత్సరాల వరకు వయస్సున్న ప్రతి ఒక్కరూ దీనికి అర్హులుగా ప్రకటించింది.

ఈ వర్గాలకు వర్తింపు

భవన నిర్మాణ, ఇతర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను అసంఘటిత కార్మికులుగా గుర్తించి, ముందుగా వీరికి ఈ–శ్రామ్ గుర్తింపు కార్డులు ఇవ్వనున్నారు. ముఖ్యంగా తాపీ మేస్త్రీలతో పాటు సెంట్రింగ్, తాపీ కూలీలు, ఐరన్ రాడ్ బెండర్లు, కార్పెంటర్లు, పెయింటింగ్, వెల్డర్లు, శానిటరీ వర్కర్లు, ప్లంబర్, ఎలక్ట్రిషియన్, బండలు, మట్టి పని చేసే కార్మికులు, ఫారం పాండ్స్, గుంతలు తీయుట, చదును చేయుట, చెరువులు, బావులు పూడిక తీయుట, బావులు తవ్వుట, నాపరాయి, మార్బుల్స్, గ్రానైట్స్, టైల్స్, మొజాయిక్ మొదలగు ఫ్లోరింగ్, కార్మికులు, పాలిషింగ్, సెంట్రింగ్, సీలింగ్ వర్క్స్, పెయింటింగ్స్, సున్నము వేయుట, తోపుడు బండ్ల వ్యాపారులు, కోరియర్ బాయ్స్, చేతి వృత్తిదారులు, రోడ్డు నిర్మాణ పనిచేసే వారితో పాటు వివిధ పరిశ్రమలు, కారాగారాల్లో రూ. 15వేల లోపు వేతనం పొందుతున్న కార్మికులు అర్హులు. ఈపీఎఫ్, ఈఎస్‌ఐ లేని వారికి కూడా ఇది వర్తింపజేశారు.



కర్నూలులోని కార్మిక శాఖ జిల్లా కార్యాలయం

కావాల్సిన ధ్రువపత్రాలు

వలస కార్మికుడు రేషన్ కార్డు పొందాలంటే ముందుగా ఈ–శ్రామ్ గుర్తింపు కార్డుల తీసుకోవాలి. ఇది కార్మిక శాఖ పర్యవేక్షణలో నమోదు ప్రక్రియ చేపట్టారు. ఆధార్ లేదా సరైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకునే వీలు కల్పించారు. ఏదైనా గుర్తింపు కార్డు, ఫోన్ నంబర్, ఆధార్ కార్డు, కార్మికుడి బ్యాంకు ఖాతా పుస్తకం, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ నంబర్, నామిని ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలతో సమీపంలోని సచివాలయానికి వెళ్తే ఉచితంగా దరఖాస్తు చేస్తారు. ఈ శ్రామ్ గుర్తింపు కార్డుల జారీ కోసం కార్మికులతో పనులు చేయించుకునే సంస్థలు, పరిశ్రమల యజమానులు, ఏజెన్సీలు సహకారం అందించాలి. కార్మిక శాఖ సిబ్బంది కూడా సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంటారు.

సద్వినియోగం చేసుకోండి



అసంఘటిత కార్మికులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఈశ్రామ్ కార్డులు జారీ చేస్తుంది. కార్మికుడు తన సెల్ నంబర్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, నామిని ఆధార్, సెల్ నంబర్, బ్యాంకు ఖాతా తీసుకెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించని, రూ.15వేల లోపు వేతనం పొందే ప్రతి ఒక్కరూ దీనికి అర్హులు. ఈ శ్రామ్ కార్డు పొంది, గ్రామ సచివాలయ లేదా మా సిబ్బందిని సంప్రదిస్తే రేషన్ కార్డులు ఇప్పిస్తారు. నివాస రాష్ట్రాల్లో కార్డు ఉంటే దానిని ఇక్కడికి బదలాయించుకోవచ్చు.ఈ అవకాశాన్ని కార్మికుల సద్వినియోగం చేసుకోవాలి. – బాలు నాయక్, కార్మిక శాఖ జాయింట్ కమిషనర్, కర్నూలు

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు

కర్నూలు(హాస్పిటల్)/నంద్యాలటౌన్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 10న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించే ప్రాంతాలను సోమవారం వైద్యాధికారులు ప్రకటించారు.

మండలం/పట్టణం	వైద్యశిబిరం
ఎమ్మిగనూరు	కడిమెట్ల-2
వెల్దుర్తి	శ్రీరంగాపురం (బోగోలు)
తుగ్గలి	రామకొండ (ఆర్ఎస్.పెండేకల్)
పెద్దకడుబూరు	హెచ్. మురవణి
పత్తికొండ	పత్తికొండ-2
ఓర్వకల్	సోమయాజులపల్లి
నందవరం	నాగులదిన్నె-2
మంత్రాలయం	చిలకలడోన-1
మద్దికెర	హంప(పెరవలి)
కర్నూలు	కొత్తపేట యుపీహెచ్‌సీ
కర్నూలు	జి.సింగవరం
కౌతాళం	కుంబళనూరు
కోసిగి	సజ్జలగూడెం
కోడుమూరు	ఎర్రగుడి
కల్లూరు	నాయకల్లు
హోళగుంద	లింగదహళ్లి
గోనెగండ్ల	జి.అగ్రహారం
దేవనకొండ	నెల్లిబండ
చిప్పగిరి	ఏరూరు
సి.బెళగల్	కొండాపురం
ఆస్పరి	ముతుకూరు
ఆలూరు	మొలగవల్లి-1
ఆదోని	హనుమాన్‌నగర్ యుపీహెచ్‌సీ
ఆదోని	మాంత్రికి
నంద్యాల జిల్లాలో	
శిరివెళ్ల	గుంపారమన్ దిన్నె
అవుకు	చెన్నం పల్లె
వెలుగోడు	గుంతకందల
పాణ్యం	కందికాయలపల్లె
రుద్రవరం	చిన్న కంబాలూరు
కొత్తపల్లె	మునలమడుగు
ప్యాపిలి	చంద్రపల్లి
చాగలమర్రి	చిన్నవంగలి
నందికొట్కూరు	వడ్డెమాన్
కొలిమిగుండ్ల	చింతలయపల్లె
పాములపాడు	భానుముక్కల
సంజామల	అల్వకొండ
ఉయ్యాలవాడ	సుద్దమల్ల
జూపాడు బంగ్లా	మండ్లెం- 2
నంద్యాల	పులిమద్ది
ఆళ్లగడ్డ	ఆర్.కృష్ణాపురం
బనగానపల్లె	చెరువుపల్లె
కోయిలకుంట్ల	కలుగోట్ల
బేతంచెర్ల	గోరుమనకొండ
డోన్	చిన్న మల్కాపురం
మిడుతూరు	చెరుకుచర్ల
ఆత్మకూరు	కృష్ణాపురం
బండి ఆత్మకూరు	బండిఆత్మకూరు -2
దొర్నిపాడు	బుర్రిరెడ్డి పల్లె
బేతంచెర్ల	యూపీహెచ్‌సీ బేతంచెర్ల

స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి

బనగానపల్లె రూరల్: నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి రంగాల్లో నైపుణ్యం పెంచుకుని అందులో రాణించాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రధాన అధికారిణి, సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి అన్నారు. మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కేవీకేలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మూడు నెలలుగా నిరుద్యోగ యువకులకు క్వాలిటీ సీడ్స్ గ్రోవర్, నర్సరీ వర్కర్స్, డెటా ఎంట్రీ అపరేటర్స్ కోర్సుల్లో ఇచ్చిన శిక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కోర్సు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చదువుకున్న వారు ప్రభుత్వ ఉద్యోగాల పైనే ఆధారపడకుండా వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. ఇందుకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీహనుమంతరాయ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ సొసైటీ ఏఓ సురేష్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు రవిగౌడ్, కేవీ రమణయ్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ, లక్ష్మీప్రియ, ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న కేవీకే ప్రధాన అధికారిణి ధనలక్ష్మి

బ్యాంకు ఖాతా నుంచి నగదు కాజేశారు

- స్పందనలో బాధితురాలు ఎస్పీకి ఫిర్యాదు

కర్నూలు: తన ప్రమేయం లేకుండా ఎస్‌బీఐ ఖాతా నుంచి విడతల వారీగా గుర్తు తెలియని వ్యక్తులు రూ.12 వేలు కాజేశారని, విచారణ జరిపి న్యాయం చేయాల్సిందిగా గూడూరు మండలం బూడిదపాడు గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 117 ఫిర్యాదులు రాగా వాటిని చట్ట పరిధిలో విచారించి తగు న్యాయం చేస్తానని ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు తదితరులు స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- తన కుమారునికి రైల్వే శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నాయకల్లు గ్రామానికి చెందిన రవి కుమార్, పందిపాడు గ్రామానికి చెందిన ఈరన్న కలిసి రూ.4.50 లక్షలు డబ్బు తీసుకుని మోసం చేశారని కల్లూరు మండలం పందిపాడు గ్రామానికి చెందిన రామచంద్రుడు ఫిర్యాదు చేశారు.
- గిడ్డి మహమ్మద్ అనే వ్యక్తి సంవత్సరానికి రూ.10 వేలు చొప్పున ఐదేళ్ల పాటు ఎల్‌ఐసీ ప్రీమియం డబ్బులు కట్టించుకుని మోసం చేశాడని పెద్దకడుబూరుకు చెందిన ఖాదర్ ఎస్పీ ఎదుట వాపోయాడు.
- తన పేరు మీద ఉన్న ఇంటిని రాసివ్వాలని అల్లుడు గోపాల్ కొట్టి ఇంటి నుంచి బయటకు గెంటేశాడని కర్నూలు సంజీవయ్య నగర్‌కు చెందిన బోయ చిన్నమ్మ ఫిర్యాదు చేశారు.
- ఆడబిడ్డ పుట్టిందని భర్త, అత్త, ఆడపడుచులు వేధిస్తూ అదనపు కట్నం తీసుకురావాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని హొళగుందకు చెందిన వడ్డె మంగమ్మ తెలిపారు.
- ఇంటి అవసరాల కోసం తీసుకున్న డబ్బు సకాలంలో చెల్లించలేదని కర్నూలు ముత్తూట్ ఫైనాన్స్ వారు తాకట్టు పెట్టిన తన బంగారాన్ని వేలం వేసి అమ్మేశారని, న్యాయం చేయాలని నందికొట్కూరుకు చెందిన సుధారాణి ఎస్పీకి విన్నవించారు.
- కర్నూలు శ్రీనగర్ కాలనీలో ఉన్న అర సెంటు స్థలంలో అప్పు చేసి గుడిసె వేసుకున్నామని, అయితే ఇంటి పక్కల వారు ఆ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలుకు చెందిన మహేశ్వరి ఫిర్యాదు చేశారు.

రైలు కింద పడి మహిళ మృతి

కర్నూలు: స్థానిక కృష్ణానగర్ రైల్వే బ్రిడ్జి 246.5 కిలోమీటర్ వద్ద పట్టాలపై గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసులు అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. సోమవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. నల్లని హిజాబ్ (బురఖా) మృతదేహం పక్కన రైలుపట్టాలపై పడి ఉండటం వల్ల చనిపోయిన మహిళ ముస్లిం వ్యక్తి అని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉంటుంది. ప్రమాదంలో తల, ముఖం పూర్తిగా నుజ్జునుజ్జు అయి గుర్తుపట్టని విధంగా ఉంది. చీకటి సమయంలో ప్రమాదం జరిగినందున కుక్కలు మృతదేహాన్ని పీలికలు చేశాయి. ఎడమ కాలు, ఎడమ చేయి కనిపించలేదు. ఒంటిపై పింక్ కలర్ పంజాబీ డ్రస్సు చినిగిపోయి రక్తంతో తడిచింది. ఆచూకీ తెలిసినవారు 8555985303 లేదా 9440732143 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

బొమ్మలసత్రం: వివిధ ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఆయన స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 135 మంది వివిధ సమస్యలపై ఎస్పీని కలిసి వినతులు అందజేశారు. వాటిలో కొన్ని ఫిర్యాదులను అక్కడిక్కడే ఫోన్‌లో మాట్లాడి ఎస్పీ పరిష్కారం చూపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరైనా బాధితులు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఎస్‌బీ డీఎస్పీ సంతోష్ తదితరులు ఉన్నారు.



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి

స్పందన ఫిర్యాదుల్లో కొన్ని....

- ఏటీఎం సెంటర్‌లో గుర్తు తెలియని ఇద్దరు యువకులు తనను మభ్యపెట్టి ఏటీఎం కార్డు మార్చి రూ. 68,500 డ్రా చేసుకున్నారని కోవెలకుంట్ల మండలం బిజనవేముల గ్రామానికి చెందిన మాబుహుస్సేన్ తెలిపారు. కోవెలకుంట్ల పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని మీరు స్పందించి న్యాయం చేయాలని ఎస్పీకి బాధితుడు విన్నవించాడు.
- శిల్పానగర్‌కు చెందిన మనోజ్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేద్దామని నమ్మించి రూ. 30 లక్షలు కాజేశారని నంద్యాల పట్టణం పొన్నాపురానికి చెందిన వరదరాజు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.
- తాను సాగు చేసుకుంటున్న భూమిని కొందరు దౌర్జన్యంగా నాశనం చేశారని బండిఆత్మకూరు మండలం పరమటూరు గ్రామానికి చెందిన చిన్నస్వామి ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

నాలుగు పురుగు మందులపై నిషేధం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రమాదకరమైన నాలుగు పురుగు మందులను నిషేధిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. డైకోఫాల్, డైనోక్యాప్, మెథోమిల్, మోనోక్రోటోపాస్ 36 శాతం ఎస్‌సీ పురుగుమందులు నిషేధిత మందుల జాబితాలో పడ్డాయి. అయితే ఇప్పటికే తయారై మార్కెట్‌లో ఉంటే నోటిఫికేషన్ విడుదలైన తేదీ నుంచి ఏడాదిలోపు అమ్ముకునే అవకాశం కల్పించింది. కాగా కొన్ని రకాల మందులను కొన్ని పంటలకు వాడకుండా నిషేధం విధించింది.

- జొన్న, శనగ, సోయాబీన్, ఆముదం, ప్రొద్దుతిరుగుడు, బెండ, వంకాయ, క్యాలీఫ్లవర్, ముల్లంగి, టమాట పంటలకు మలాథియాన్ వాడరాదు.
- జనపనారా, జొన్న పంటలపై క్వినాల్‌ఫాస్ వాడరాదు.
- మాంకోజెబ్ పురుగుమందును జొన్న, డైమిథోయేట్ పురుగుమందును పండ్లు, కూరగాయల పంటలకు, ఆక్సీఫ్లోరోఫెన్‌ఆలూ వేరుశనగకు, క్లోరోఫైరిపాస్ పురుగుమందును రేగు, నిమ్మ, పొగాకు, బత్తాయి పంటలకు వాడరాని కేంద్రం ప్రకటించినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.
- వీటిల్లో పురుగుమందుల ప్రభావం మోతాదు కంటే ఎక్కువగా ఉండటం వల్ల నిషేధం విధించింది.

ఎస్ఆర్‌బీసీలో యువకుడి గల్లంతు



చాకలి మధు(ఫైల్)

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామానికి చెందిన చాకలి మధు(24) అనే యువకుడు సోమవారం ఎస్ఆర్‌బీసీ ప్రధాన కాల్వలో ప్రమాద శాత్తు కాలు జారీ గల్లంతయ్యాడు. కాల్వలోని నీటిని పొలానికి పారించుకునేందుకు ఏర్పాటు చేసిన మోటర్ వద్ద పైపులు అమర్చేందుకు వెళ్లగా ఈ ఘటన జరిగింది. తండ్రి మల్లేష్ అందించిన సమాచారం మేరకు పోలీసులు, రైతులు, యువకులు కాల్వ వెంబడి గాలించినా ఆచూకీ లభించలేదు. నీటి ప్రవాహం అధికంగా ఉండటం, దానికి తోడు చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు.

బీఈడీ పరీక్షలకు 72 మంది గైర్హాజరు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు సోమవారం 72 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలకు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 16 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో 668 మంది గాను 596 మంది సోమవారం పరీక్ష రాసినట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు.

ఇనుప ఖనిజం క్వారీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూసిటీ): వెల్దుర్తి మండల పరిధిలో రామళ్ల కోట– బేతంచెర్ల రోడ్డులో ఉన్న ఇనుప ఖనిజం క్వారీని సోమవారం మైనింగ్ అధికారులు తనిఖీ చేశారు. అనుమతులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన మేరకు తవ్వకాలు జరపాలని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ ఈ సందర్భంగా క్వారీ యజమానికి సూచించారు. తనిఖీలో విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి ఉన్నారు.

రేపు హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): ఈనెల 11 న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ సీనియర్ మహిళలు, జూనియర్ బాలుర జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రుద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు కడప జిల్లాలో ఈనెల 14 నుంచి 16 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమ వెంట పుట్టిన తేదీ, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో తెచ్చుకోవాలన్నారు. వివరాలకు సెల్: 94402–22232 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

13న డోన్‌లో జాబ్ మేళా

డోన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోమవారం జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను ప్రభుత్వ ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డితో కలిసి ఆయన విడుదల చేశారు. పలు ప్రముఖ కంపెనీలు హాజరయ్యే ఈ మేళాకు పది, ఆపై విద్యార్హత కలిగిన నిరుద్యోగులు అర్హులన్నారు. ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు వెంట విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, రెండు ఫొటోలను తెచ్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94402 24291, 95426 43747 నంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ డీఈ గోపి, ప్రభుత్వ ఐటీఐ శిక్షకులు రాముడు, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు



ఎంతసేపైనా నీటిలోనే ఉందాం!

ఎండల తీవ్రత రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తోంది. ఎండా కాలాన్ని మరిపిస్తూ ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు ఉగ్రరూపం దాలుస్తుండటంతో మనుషులతో పాటు మూగజీవాలు కూడా బెంబేలెత్తుతున్నాయి. కర్నూలు నగర శివారు గార్గేయపురం చెరువులో నీటిలో బర్రెలు సేదతీరుతున్న దృశ్యం తాజా పరిస్థితికి అద్దం పట్టింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు